క్లుప్తంగా

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట

మాకవరపాలెం: మండల కేంద్రంలోని కొత్తవీధిలో సుమారు రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ట చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ప్రతిష్ట చేయనున్న విగ్రహాలకు క్షీర, జల, పుష్పాదివాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఆదినారాయణ, శ్రీనివాసరావు, ఇతర సభ్యులు, విశ్వబ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెండో విడతగా 1,010 పాసు పుస్తకాలు



మాకవరపాలెంలో వలంటీర్లకు పాసు పుస్తకాలు అందజేస్తున్న వీఆర్వో లక్ష్మణరావు

మాకవరపాలెం: భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో పంపిణీ చేసేందుకు రెండో విడతగా 1010 పాసు పుస్తకాలు వచ్చాయని తహసీల్దార్ ప్రసాదరావు తెలిపారు. జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా సర్వే పూర్తయిన తాడపాల, హరప్పఅగ్రహారం, మల్లవరం, పీపీ అగ్రహారం, జంగాపల్లి, మాకవరపాలెం, వెంకన్నపాలెం, సీతన్నఅగ్రహారం గ్రామాల్లో సర్వే పూర్తి చేశామన్నారు. రెండో విడతగా వచ్చిన పాసు పుస్తకాలను వీఆర్వోలు వలంటీర్ల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

నాతవరం సర్వేయర్‌గా బాలరెడ్డి నియామకం

నాతవరం: మండల సర్వేయర్‌గా కె. బాలరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఆయన గురువారం తహసీల్దార్ పి.కనకారావును కార్యాలయంలో కలిసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సచివాలయ సర్వేయర్లతో భూ రీసర్వేకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. శ్రీకాకుం జిల్లా టెక్కలిలో పని చేస్తున్న సర్వేయర్ బాలరెడ్డిని ప్రభుత్వం ఇక్కడ నియమించింది. ఈ సందర్భంగా సర్వేయర్ మాట్లాడుతూ జగనన్న భూ రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, రైతుల భూ సమస్యల పట్ల సకాలంలో స్పందిస్తానన్నారు. సచివాలయ సర్వేయర్లు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

7న ఎం. కోడూరు మోదకొండమ్మ పండగ



ఎం. కోడూరు మోదకొండమ్మ అమ్మవారు

మాడుగుల రూరల్: మండలంలో ఎం. కోడూరు గ్రామ దేవత, మోదకొండమ్మ అమ్మవారి పండగ ఈ నెల 7న ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు భీశెట్టి వెంకట సత్యవతి, మండల స్థాయి ప్రజా ప్రతినిధులు హాజరవుతారని సర్పంచ్ పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్



ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో సుబ్బలక్ష్మి తదితరులు

దేవరాపల్లి: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుందని దేవరాపల్లి తహసీల్దార్ ఎం. లక్ష్మి అన్నారు. ఈ మేరకు వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో దేవరాపల్లిలో గురువారం రహదారి భద్రతపై ఎంపీడీవో సీహెచ్ సుబ్బలక్ష్మి, వెలుగు ఏపీఎం ఎస్. ప్రభాకర్, వెలుగు సీసీలు, వివోఏలతో కలిసి ర్యాలీని నిర్వహించి నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలంటూ నినాదాలు చేశారు.

వైఎస్సార్ అభయహస్తంతో ఆర్థిక భరోసా

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు
- దేవరాపల్లిలో నూతన పింఛన్ల పంపిణీ



దేవరాపల్లిలో అభయహస్తం పింఛన్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన అభయహస్తం పథకం పొదుపు సంఘాల మహిళల పాలిట వరం అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి రైవాడ అతిథి గృహంలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ అభయ హస్తం పింఛన్లను ఆయన గురువారం అందజేశారు. మండల వ్యాప్తంగా 343 పింఛన్లు మంజూరు కాగా, వీటిలో దేవరాపల్లికి మంజూరైన 51 పింఛన్లను రూ. 500 చొప్పున లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ధ్యేయంగా దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి అభయ హస్తం పథకానికి రూపకల్పన చేశారన్నారు. 60 ఏళ్లు నిండిన వృద్ధులు వైఎస్సార్ పింఛన్‌తో పాటు అభయ హస్తం పింఛన్ అందుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వంలో సామాజిక పింఛన్ ఇస్తే అభయ హస్తం పింఛన్ ఇచ్చేవారు కాదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం వైఎస్సార్ పింఛన్‌తో పాటు అర్హులందరికీ వైఎస్సార్ అభయ హస్తం పింఛన్లు కూడా అందజేస్తున్నారన్నారు. అభయ హస్తం పింఛన్ లబ్ధిదారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్, కృషి చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అభయ హస్తం పింఛన్లు కొందరికి అందడం లేదని ఇటీవల డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి మండలానికి ఒకే మారు 343 పింఛన్లు మంజూరు చేయించారని ప్రజా ప్రతినిధులు హర్షాతిరేఖాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ సభ్యుడు మొల్లి కృష్ణమూర్తి, తామరబ్బ సర్పంచ్ టోకురి రామకృష్ణ, ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి, వెలుగు ఏపీఎం ఎస్. ప్రభాకర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రహదారి పనులకు నిధులు మంజూరు



శరవేగంగా నిర్మాణం జరుగుతున్న కేజే పురం- అప్పలరాజుపురం రహదారి

మాడుగుల రూరల్: రెండు మండలాలను కలుపుతున్న అప్పలరాజుపురం నుంచి కేజే పురం రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో సుమారు రెండున్నర కిలోమీటర్ల రహదారి పనులకు నిధులు మంజూరు అయ్యాయి. రూ. 55 లక్షల రుపాయల వ్యయంతో తారురోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 20 సంవత్సరాల నుంచి ఈ రహదారి పూర్తిగా గోతులు, గాతలతో నిండిపోయి పాదచారులు సైతం నడవడానికి ఇబ్బందికరంగా వుండేది. చీడికాడ- మాడుగుల మండలాలను కలిపే ఈ రహదారి పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో వుంది. డిప్యూటీ సీఎం బూడి సహకారంతో రహదారిని వెడల్పు చేశారు. కె. కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ, మండలాల నుంచి మాడుగుల చేరుకోవడానికి ఈ రహదారి ఎంతో ఉపయోగకరం. రహదారి నిర్మాణ పనులు చేపట్టడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ సి.యమ్. బూడి ముత్యాలునాయుడుకు ప్రజలు అభినందనలు తెలిపారు.

చిన్నారి కుటుంబానికి రూ. 10 వేలు పింఛన్ అందజేత



దీక్షిత్ తల్లిదండ్రులకు పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ రామధర్మజ తదితరులు

మాడుగుల: మండలంలో సాగరం గ్రామంలో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారి దీక్షిత్‌కు రూ. 10 వేలు మంజూరైనట్లు ఎంపీపీ వేమవరపు రామధర్మజ తెలిపారు. గత నెల జరిగిన గడప గడపకు కార్యక్రమంలో గ్రామంలో పర్యటించిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడుకు రెండేళ్ల చిన్నారి దీక్షిత్ తారసపడినప్పుడు తల్లిదండ్రుల నుండి చిన్నారి పరిస్థితిని డిప్యూటీ సీఎం తెలుసుకున్నారని ఎంపీపీ తెలిపారు. వెంటనే ఆయన ఫోన్‌లో అధికారులతో మాట్లాడడంతో పింఛను మంజూరైందని రామధర్మజ తెలిపారు. గురువారం ఎంపీపీ కార్యాలయంలో రామధర్మజ దీక్షిత్ తల్లిదండ్రులకు రూ. 10 వేలు పింఛన్ అందజేశారు. దీంతో దీక్షిత్ తల్లితండ్రులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, సాగరం ఎంపీటీసీ శ్రీనాదు సూర్యకాంతం తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పంచాయతీలకు నిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

నర్సీపట్నం: రాజకీయాలకు అతీతంగా అన్ని పంచాయతీలకు నిధులు కేటాయింపు చేస్తున్నామని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రానివ్వకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పామాయిల్ సాగు ఆశాజనకంగా ఉందన్నారు. అనంతరం ఉపాధి హామీ, వ్యవసాయశాఖ, ఆరోగ్య, పశుసంవర్ధశాఖ, ఇరిగేషన్, వెలుగు, విద్యాశాఖ, ఆర్టీసీ అధికారులు ఆయా శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు గురించి వివరించారు. ఎంపీడీవో జయమాధవి, వైస్‌చైర్మన్లు తాతబాబు, రత్నం, జెడ్పీటీసీ సుకల రమణమ్మ, కార్యాలయ సూపరింటెండెంట్ రమణబాబు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం



మహిళతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

రావికమతం: నియోజకవర్గంలో సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. తట్టబంద పంచాయతీ శివారు తట్టబంద, ఎల్ఎస్‌పురం, బూరుగుపాలెం గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని లబ్ధిదారులను ధర్మశ్రీ అడిగి తెలుసుకున్నారు. కుళాయిలు పనులు చేపట్టాలని, కల్యాణ మండపం నిర్మించాలని ఎల్ఎస్‌పురం గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. బూరుగుపాలెంలో మంచినీటి బోరు ఏర్పాటు చేయాలని, తట్టబందలో ప్రధాన సెంటర్‌లో డ్రైనేజీ నిర్మించాలని కోరగా త్వరలోనే ఆ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఎంపీపీ పైల రాజు, ఆ గ్రామ మాజీ సర్పంచ్, చోడవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, ఎంపీటీసీ సభ్యుడు పిల్లా శేషుబాబు పాల్గొన్నారు.

బోరు పని చేయక మంచినీటికి ఇక్కట్లు



మోటారు కాలిపోయి పని చేయని నీటి పథకం

రావికమతం: మత్స్యపురం గ్రామంలో మంచినీటి పథకం మోటారు కాలిపోయి పనిచేయడం లేదు. దీంతో స్థానికులు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. సుమారు 500కు పైగా ఉన్న గ్రామస్తులకు తాగునీరందించే 10 వేల లీటర్ల నీటి పథకానికి అమర్చిన మోటారు వారం రోజుల క్రితం పాడైంది. కార్యదర్శి కోటేశ్వరరావుకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని గ్రామస్తుడు సత్తిబాబునాయుడు తెలిపారు. గ్రామంలో రెండు తాగునీటి బోర్లున్నప్పటికీ ఒకటి పాడై ఉందని ఉన్న ఒక్కబోరు నీటిని అందరూ వాడుతుండటంతో అదికూడా బురద నీరు వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం: గుమ్మాళ్లపాడు గ్రామంలో రెండేళ్ల కోసారి చేసే గ్రామ దేవత ముత్యాలమ్మతల్లి పండగ గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు గ్రామస్తులు, మహిళలు ఉదయం నుంచీ బారులు తీరారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి

నాతవరం: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసే బాధ్యత అధికారులపైనే ఉందని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు అన్నారు. తన కార్యాలయంలో గురువారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇల్లు కట్టుకునే వారికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలపై అవగాహన కల్పించాలన్నారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం యుద్ధ ప్రతిపాదికన ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ జేఈ జోగారావు, పంచాయతీ విస్తరణాధికారి ప్రేమలీల, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ

మాడుగుల: స్థానిక కేజీబీవీ పాఠశాలను ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ అధికారిణి బి.శకుంతల గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఇంటర్‌లో తప్పిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన రెమీడియల్ తరగతులు ఎలా జరుగుతున్నదీ పరిశీలించారు. అనంతరం పాఠశాలలో రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్మశానంలో చెత్త నివారణకు చర్యలు తీసుకోవాలి

మాకవరపాలెం: శ్మశానంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు అధికారులకు సూచించారు. స్థానిక సచివాలయంలో గురువారం పాలకవర్గ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన వివిధ పనులు, సమస్యల పరిష్కారంపై చర్చించారు. అనంతరం కొందరు వార్డు సభ్యులు మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రం వినియోగంలోకి తీసుకురాకుండా సమీపంలో ఉన్న శ్మశాన స్థలంలో చెత్త వేస్తున్నారన్నారు. అలాగే ఇక్కడి చెరువులో కూడా వ్యర్థాలను వేస్తున్నారని, వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సర్పంచ్ అల్లంపల్లి శిరీష, ఎంపీటీసీ సభ్యుడు రుత్తల సర్వేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ సీతామహాలక్ష్మి, ఉప సర్పంచ్ రాము, కార్యదర్శి సుదర్శనరావు పాల్గొన్నారు.

పేదలకు ఆహార పొట్లాల పంపిణీ

బుచ్చెయ్యపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాకాశి ఉమామహేశ్వరరావు రెండో వర్ధంతి వేడుకలను గురువారం వడ్డాది జంక్షన్‌లో నిర్వహించారు. ఆయన కుమారులు రాజేష్, కోపరేటివ్ మాజీ సెక్రటరీ సయ్యపురెడ్డి వరహాలబాబు, కోపరేటివ్ చైర్ పర్సన్ దొండా సన్యాశిరావు, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరి నాగేశ్వరరావు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు ఆహార పొట్లాలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.

ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే చర్యలు

రావికమతం: ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా ఇసుక తవ్వకాలు చేసే ప్రతి ఇసుక బండి నిర్వాహకుడిపైనా కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ మహేశ్వరరావు హెచ్చరించారు. కొత్తకోట గ్రామానికి తాగునీరు సరఫరా చేసే భారీ మంచినీటి పథకాన్ని ఇటీవల ధర్మవరం వద్ద సర్పానది ఒడ్డున నిర్మించారు. అయితే కొత్తకోట పరిసర గ్రామాలకు చెందిన పలువురు ఇసుక బండ్ల వ్యాపారులు ఇసుకను తరలించేస్తున్నారు. దీనిపై పలువురు రైతులు స్థానిక పంచాయతీ, రెవెన్యూ అధికారులు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన గురువారం పరిశీలించారు. ఇకపై ఎవరైనా ఇసుక తరలిస్తే తక్షణం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

శభాష్ వలంటీర్



ఎన్‌టీఆర్ ఆసుపత్రిలో బాధితుడు ఈశ్వరరావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ స్వామి

మాడుగుల: స్థానిక ఒకటో సచివాలయ పరిధిలో నివాసం ఉంటున్న అప్పలబత్తుల ఈశ్వరరావు అనారోగ్యంతో ఎన్‌టీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కనీస ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో ఆ పరిధిలో ఉన్న వలంటీర్ నాగోజీ స్వామి తన సొంత ఖర్చులతో వెళ్లి బాధితుడుకి రూ. 2750 పింఛను అందించాడు. తమలాంటి అభాగ్యులను ఆదుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఈశ్వరరావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



రైతులకు పాసు పుపస్తకాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ శ్రీనాగగోపి

నాతవరం: బ్రిటిష్ కాలం నుంచి వెంటాడే భూ సమస్యలకు జగనన్న భూ రీసర్వే ద్వారా శాశ్వత పరిష్కారం దొరుకుతుందని వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి అన్నారు. మండలంలో చమ్మచింత పంచాయతీ శివారు పొట్టినాగన్నదొరపాలెంలో గురువారం రీసర్వే చేసిన 64 మంది రైతుల భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. భూముల రీసర్వే ద్వారా రైతులకు భూ సరిహద్దు సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పొట్టినాగన్నదొరపాలెంలో భూములు సాగు చేసుకోవడం తప్ప చాలా మంది రైతులకు నేటి వరకు పాసు పుస్తకాలు లేవన్నారు. అలాంటిది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సదాశయంతో ప్రవేశపెట్టిన భూరీసర్వే ద్వారా రైతులకు ఒక్కపైసా ఖర్చు లేకుండా భూములు సర్వే చేసి ఉచితంగా పాసు పుస్తకాలు ఇవ్వడం ఆనందాయకమన్నారు. పాసు పుస్తకాలు ఇవ్వడంతో వైఎస్సార్ రైతు భరోసా పథకంలో పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ 13,500 ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం చేస్తుందన్నారు. సర్పంచ్ వెలకాడ కొండబాబు, వైస్ సర్పంచ్ అప్పన దివాణం, నాతవరం పీఏసీఎస్ డైరెక్టర్ అప్పన సత్యనారాయణ, ఆర్ఐ నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉత్సవాల నిర్వహణ అభినందనీయం



సింగన్నదొరపాలెంలో మరిడిమాంబకు పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



గొండుపాలెంలో శ్రీకృష్ణునికి పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

కె.కోటపాడు : గ్రామాల్లో ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే అమ్మవార్ల పెద్ద పండగలను గ్రామస్తులు ఐకమత్యంతో నిర్వహించుకోవడం అభినందనీయమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. సింగన్నదొరపాలెం, కేజే పురం గ్రామాల్లో నిర్వహిస్తున్న మరిడిమాంబ అమ్మవార్ల పెద్ద పండగల్లో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ఆయన సతీమణి రమణమ్మ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ ప్రత్యేక పూజలు చేశారు. పండగ నేపథ్యంలో విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. డిప్యూటీ సీఎం వెంట రెండు గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు లాలం నాని, రొంగలి వెంకటరమణ, మాజీ ఎంపీపీ నారపాటి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని ఆలయ ప్రారంభోత్సవం

గొండుపాలెంలో శ్రీకృష్ణుని ఆలయం ప్రారంభోత్సవంతో పాటు విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో చల్లా ఆదిత్య సిద్ధాంతి శాస్త్రోక్తంగా శ్రీకృష్ణుని ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట జరిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు, సర్పంచ్‌లు బండారు కనక మల్లీశ్వరి, బండారు దేముళ్లు, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, మాజీ సర్పంచ్ బండారు రామస్వామిపాత్రుడు, వంటాకు శ్రీను, బండారు లక్ష్మణరావు, మాజీ గోవాడ షుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమరిడిమాంబ అమ్మవారి జాతర



ప్రత్యేక అలంకరణలో మరిడిమాంబ అమ్మవారు



గుర్రప్పందాల విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐలు స్వామినాయుడు, గణేష్



అమ్మవారి సన్నిధిలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తదితరులు

నర్సీపట్నం: మున్సిపాలిటీ బలిఘట్టంలో శ్రీమరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా గురువారం గుర్రప్పందాలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుండి 15 గుర్రాలు పోటీల్లో పాల్గొన్నాయి. రావన్నపాలెం చోడమాంబ గుర్రం, దేవరాపల్లికి చెందిన మధురి సాయి గుర్రం, చోడవరానికి చెందిన మోదమాంబ గుర్రం గెలుపొందాయి. గెలుపొందిన గుర్రాల విజేతలకు పూర్వ సీఐ స్వామినాయుడు, ప్రస్తుత సీఐ గణేష్, గ్రామ పెద్దలు శెట్టి మోహన్, గుడబండి నాగేశ్వరరావు బహుమతులు అందజేసారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని అదే మైదానంలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. గ్రామస్థులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా పదాలపాలెం మరిడిమాంబ పండగ

రోలుగుంట: మండలం పదాలపాలెం గ్రామంలో గురువారం సర్పంచ్ పాచిల సత్యవతి ఆధ్వర్యంలో మరిడిమాంబ పండగను వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల మహిళా శాఖ అధ్యక్షురాలు జెర్రిపోతుల రామలక్ష్మి దంపతులతో పాటు పలువురు నాయకులు, తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద మందుగుండు సామాను కాల్చి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు విస్తరణ పనులకు మొదలైన సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ, సర్వే సిబ్బంది

రావికమతం: కొత్తకోట గ్రామంలో రోడ్డు విస్తరణ పనులకు గురువారం నుంచి సర్వే పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ట్రాఫిక్ సమస్యకు తెర పడుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నర్సీపట్నం- భీమునిపట్నం రహదారిలో అన్ని గ్రామాల్లో 15 ఏళ్ల క్రితమే 70 అడుగుల మేర రహదారి విస్తరణ పనులు జరిగాయి. అయితే కొత్తకోటలో మాత్రం ఎందుచేతనో ఆగిపోయాయి. దీంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రెడు బస్సులు ఎదురెదురుగా వస్తే తప్పించుకోవడం ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో చోడవరం మండలం గంధవరం నుంచి రోలుగుంట మండలం వెలంకాయపాలెం వరకూ రహదారి విస్తరణకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రతిపాదనల మేరకు న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి ప్రభుత్వం రూ.104 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఆరు నెలలుగా జాప్యం అవుతున్న పనులు ఇటీవల మరలా ప్రారంభం అయ్యాయి. గ్రామ వీఆర్వో లక్ష్మి, లైసెన్స్‌డ్ సర్వేయర్ శ్రీరామ్మూర్తి, విలేజ్ సర్వేయర్ శ్రీను, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కబేలాకు తరలిస్తున్న గోవుల అడ్డగింత

రోలుగుంట: వడ్డాది -నర్సీపట్నం దారిలో గురువారం బీజేపీ కార్యకర్తలు అనుమానంతో బొలేరో వాహనాన్ని అడ్డుకున్నారు. అందులో గోవులు ఉండడంతో ఆ వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఏజెన్సీ ప్రాంతంలో వాటిని కొనుగోలు చేసి తుని సంతకు తరలిస్తున్నట్టు ఎస్ఐ నాగకార్తీక్ తెలుసుకున్నారు. వీటిని గో సంరక్షణ శాఖకు అప్పగించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. దీనిపై బీజేపీ నాయకుడు ఈశ్వరరావు, తమరాన వెంకటరమణ మాట్లాడుతూ పదుల సంఖ్యలో వాహనాల్లో గోవులను తరలించడం నేరమన్నారు.